www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 31 మార్చి 2023



నేడు న్యాయవాదుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంఘం సూచనల మేరకు రాయచోటి న్యాయవాదుల సంఘం ఎన్నికలు శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. రెండు ప్యానల్లు పోటాపోటీగా తలపడుతున్నారు. సీనియర్ న్యాయవాది కె.నాగిరెడ్డి అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా కె.రాజ్‌కుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా ఉదయగిరి రామారావు జనేయులు, సహాయ కార్యదర్శిగా టి.వెంకటరమణ, ట్రెజరర్‌గా దేవపట్ల నాగమునయ్య, స్పోర్ట్స్ అండ్ కల్చర్ కార్యదర్శిగా వేముల సిద్దయ్య పోటీ చేయనున్నారు. ప్రత్యర్థి ప్యానల్‌గా కె.రవిశంకర్ అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా నాగముని, సహాయ కార్యదర్శిగా వెంకటాద్రి, ట్రెజరర్ వీరభద్ర, స్పోర్ట్స్ అండ్ కల్చర్ కార్యదర్శిగా రామ్‌కుమార్, లైబ్రేరియన్‌గా వెంకటమూర్తి బరిలో ఉన్నారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులుగా వందమందికిపైగా ఉన్నారు. వారిలో 74 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రాయచోటి బార్ అసోసియేషన్ లో 1976 నుండి 47 సంవత్సరాలు పాటు న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు ఎన్నికల ఫలితాలు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రకటిస్తారు.

రాములోరి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి అంబటి, మేడా, ఆకేపాటి

పెద్ద సంఖ్యలో పాల్గొన్న యాత్రికులు

నేడు ధ్వజారోహణం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆకేపాటి, మేడా దంపతులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈ నెల 30 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు వేదపండితులు, అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. బాజాభజంత్రీలు నడుమ వేదపండితుల మంత్రోచ్చరణలతో అంకురార్పణం చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు హారతి ఇచ్చారు. కేరళ వాయిద్యకారులు ప్రదర్శన పలువురిని ఆకట్టుకొంది.

కార్యక్రమంలో టిటిడి డిప్యూటి ఇఒ నటేష్‌బాబు, సూపరింటెండెంట్లు వెంకటేశయ్య, ఆర్సి సుబ్రమణ్యం, కంకణ భట్టార్ కెహెచ్.రాజేష్‌కుమార్, ముఖ్య వేద పండితులు రాజేష్ భట్టార్, ఆలయ ప్రధాన అర్చకులు వీణా రాఘవాచార్యులు, అర్చకులు పవన్‌కుమార్, వేద పండితులు పాల్గొన్నారు.

వైభవంగా నవమి వేడుకలు : ఒంటిమిట్టలోని కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఏకశిలపై వెలసిన సీతారామ, లక్ష్మణలను యాత్రికులు వేకువజాము నుండే దర్శిం చుకున్నారు. ఉత్సవ మూర్తులను వివిధ రాష్ట్రాల నుంచి తెచ్చిన పూలతో అలంకరించారు. అనం తరం ఉత్సవ మూర్తులను తిరుమాడ వీధిలో ఊరేగించారు.

పట్టువస్త్రాల సమర్పణ : బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీరామనమి నాడు రాములోరికి ప్రభుత్వం తరపున మంత్రి అంబటి రాంబాబు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయనకు టిటిడి అధికారులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రాలతో పట్టు వస్త్రాలను సీతారాములకు సమర్పించారు. అనంతరం గర్భగుడిలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలను సమర్పించారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి దంపతులు కూడా శ్రీ కోదండరామస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో పెన్నా సిమెంట్ అధినేత వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ముమ్మడి శ్రీధర్‌రెడ్డి నాయకులు ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, నాయుడు ఉన్నారు.

తలంబ్రాల తయారీ ప్రారంభం : శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 5న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో తలంబ్రాల తయారీని ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం నుంచి ఊరేగింపుగా కల్యాణవేదిక వద్ద గల పీఠిని వద్దకు తీసుకొచ్చారు. ఇక్కడి హాలులో రామసేవకులు బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేస్తున్నారు. తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. దాదాపు 300 మంది శ్రీవారి సేవకులు రెండు లక్షల తలంబ్రాల ప్యాకెట్లను తయారు చేస్తున్నారు.

నేడు ధ్వజారోహణం : శుక్రవారం ఉదయం 9 గంటలకు వృషభలగ్నంలో ధ్వజారోహణం ఉంటుంది. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శేష వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శన మిస్తారు.

5న శ్రీ సీతారాముల కల్యాణం : ఏప్రిల్ 5వ తేదీన రాత్రి 8 నుంచి 10 గంటల వరకు సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. ప్రజలు రూ.750 చెల్లించి కల్యా ణంలో పాల్గొ నవచ్చు. వీరికి ఒక ఉత్తరీయం, రవికె, లడ్డూ ప్రసాదం బహు మానంగా అందజేస్తారు. ఆ తరువాత తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

ముమ్మడి, ఇరగంరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం..

ప్రముఖ కాంట్రాక్టర్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సాలాబాద్ ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా ఒంటిమిట్ట ఆలయానికి వచ్చే భక్తులకు, యాత్రికులకు ఘనంగా అన్నదానం ఏర్పాటు చేశారు. జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎంఎల్‌ఎ మేడా మల్లికార్జునరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కడప డిఎస్‌పి శివారెడ్డి, ఒంటిమిట్ట ఎస్‌ఐ మధుసూదన్‌రావు భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. కోదండ రాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది అన్నదానం చేస్తున్నామని ముమ్మడి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నదానాన్ని మహోత్తమైన కార్యంగా భావిస్తున్నామని ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఓబుల్‌రెడ్డి, కొండమాచుపల్లి సర్పంచ్ శివనారాయణ, సుధాకర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, రవిచంద్రరాజు, మురళీ, పెద్ద ఎత్తున్న భక్తులు హాజరయ్యారు.



దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



అన్నం వడ్డిస్తున్న కడప డిఎస్‌పి శివారెడ్డి, ముమ్మడి, ఇరగంరెడ్డి

మూడేళ్లుగా మామి'ఢీ'లా

- అంతంత మాత్రమే దిగుబడి
- జిల్లా వ్యాప్తంగా 89,657 ఎకరాల్లో సాగు
- నిరాశలో రైతన్నలు



అరకొరగా పూత ఉన్న మామిడి చెట్లు

ప్రజాశక్తి - రాయచోటి

మూడేళ్లుగా మామిడి రైతులు ఢీలా పడిపోయారు. సరైన దిగుబడి, గిట్టుబాటు ధరలు లేక నష్టాలు పాలయ్యారు. రెండేళ్ల కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ కార ణంగా పండిన పంటకు ఎగుమతులు లేక తోటలకే వదిలేశారు. గత సంవత్సరమూ ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. గత ఏడాదిలో వర్షాలు అధికంగా కురవడంతో పూత బాగ వచ్చి కాయలు బాగా వస్తాయని రైతులు ఎంతో ఆశపడ్డారు. వారి ఆశించిన దానికంటే భిన్నంగా పూత ఆలస్యంగా ఎక్కువగా వచ్చింది. మంచు, వర్షం వాతావరణంలో మార్పు కారణంగా పూత చాలా వరకు నిలబడలేదు. దీంతో కాపు అంతంతమాత్రమే వచ్చింది. అధిక దిగుబడి సాధించడానికి, పూత రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సూచనలిచ్చే అధికారులు లేకపోవడం శోచనీయం. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా చిట్వేలు, 4400, కోడూరు 9067, ఓబులవారిపల్లి 1625, పెనగలూరు 3380, పుల్లంపేట 49 0, మదనపల్లి 1475, నిమ్మన పల్లి 2050, రామసముద్రం 1500, గుర్రం కొండ 4145, కలకడ 3445,కలికిరి 2737.5,౼ స. వి.పల్లి 4625, పీలేరు 3500, వాయల్పాడు 2875, నందలూరు 1780, రాజంపేట 935, టి. సుండుపల్లి 7590, వీరబల్లి 5262.5, చిన్నమండెం 6250, గాలివీడు 2300, లక్కిరెడ్డిపల్లి 6000, రామాపురం 3582.5, రాయచోటి 222.5, సంబేపల్లి 3075, బి.కొత్తకోట 715, కురబలకోట 750, ములకలచెరువు 625, పెద్దమండెం 1960, పిటిఎం 542.5, తంబళ్లపల్లె 750 ఎకరాల్లో మొత్తం 89,657.5 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ప్రతి ఏటా దాదాపు రూ.200 కోట్లకు పైగా విలువైన దిగుబడులు జిల్లా నంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఈ సారి అధిక వర్షాలు, గాలులతో వాతావరణంలో మార్పులతో దిగుబడి తగ్గిపోవడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. మామిడి చెట్లకు పూత, పిందె, కాత, కాయ, కోత దశలు ఎంతో కీలకం. సాధారణంగా నవంబరు నుంచి పూత రావడం జరుగుతూ ఉండేది. ఈసారి ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసం పూర్తయిన తర్వాత పూత ప్రారంభమైంది. కొన్ని రకాల చెట్లలో అసలు పూత రాలేదు. గతంలో ఏప్రిల్ మామిడి పంట కోతలు కోసి పండ్లు వచ్చేవి. ఏడాది మార్చి నెల పూర్తవుతున్నా ఇంకా పిందెల దశలో ఉన్నాయి. ప్రతికూల పరిస్థితులతో తేనె మంచు, తామర, పూత తిచే పురుగులు, బూడిద, పూత, మాడు, ఆకుజల్లెడ తెగుపోతరాలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. అరకొర కాసిన మామిడి కాయలు ఈదురు గాలులకు రాలిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి సరిగ్గా రాకపోవడంతో వ్యాపారులు కూడా కాయలను కొనడానికి వెనకడుగు వేస్తున్నారు. మూడేళ్లుగా పంటలకు సరైన ఆదాయం రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



అధిక ఖర్చులు వస్తున్నాయి

మామిడి పంటకు అధిక ఖర్చులు వస్తున్నాయి. మామిడి తోటలు దున్నకలక, కంచె, కూలీలు చెట్లకు నీరు కట్టడం, ఎరువులు, మందులు వెరసి ఖర్చులు అధికమవుతున్నాయి. మూడేళ్లుగా మామిడి పంట సరిగ్గా లేక అన్ని విధాలుగా నష్టపోయాం. ఈ ఏడాదైనా దిగుబడి బాగా వస్తుందని ఆశలు పెట్టుకున్నాం. కానీ ఆశలు నిరాశ అవుతున్నాయి. గతంలో ఈదురు గాలులు, వర్షాలకు మామిడి కొమ్మలు, చెట్లు, కాయలు నేలరాలాయి. ప్రభుత్వం ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వలేదు. ఈసారైనా ప్రభుత్వం స్పందించి ఈదు రుగాలు, వర్షాలకు, రాలిపోయి నెలపాలవుతున్న మామిడి చెట్లకు, మామిడి కాయలకు నష్టపరిహారం అందించాలి.



- కేతంరెడ్డి రవీంద్రారెడ్డి, రైతు, సంబేపల్లి మండలం.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. రైతులకు ఎరువులు, మందులు సకాలంలో అందించాలి. మే, జూన్ నెలలో రైతులకు జిల్లా అధికారులు గ్రామ స్థాయిలలో అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రభుత్వం ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా ఎవరికైతే పట్టాదారు పాసు పుస్తకాలుండి, సాగులో ఉన్న మామిడి రైతులకు అందరికీ ప్రభుత్వం తరపున వచ్చే అన్ని సబ్సిడీలను అందజేయాలి.



- సిరపురి రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా క్రార్యదర్శి.

సరైన యాజమాన్య పద్ధతి పాటించాలి

మామిడి రైతులు సరైన యాజమాన్య పద్ధతిని పాటిస్తే మొదటిసారి ఎక్కువగా పూత నిలబడే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది వాతావరణం మార్పు వల్ల వివిధ దశలలో పూత ఆలస్యంగా వచ్చింది. తేనెమంచు, పురుగు అధికమైంది. మొదట విడతగా పూసిన పూత మాత్రమే కాయగా మారింది. మిగిలిందంతా రాలిపోయింది జిల్లాలో నాణ్యమైన దిగుబడి రావడానికి నిపుణుల ద్వారా సలహాలు, సూచనలు ఇస్తున్నాం.



-పి. రవి చంద్రబాబు, జిల్లా ఉద్యాన శాఖాధికారి, రాయచోటి.

నాసిరకం పనుల్లో 'సూపర్' బ్లాక్

- పాత రిమ్స్ పనుల తరహా నిర్లక్ష్యం
- రూ.272 కోట్ల పనుల్లో ఇష్టారాజ్యం
- నిద్రావస్థలో ఎపిఎంఎస్ఐడిసి ఇంజినీర్లు



నిర్మాణంలో ఉన్న రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పుతిలోని సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ నాసిరకం పనులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నాలుగేళ్ల కిందట నుంచి సూపర్ స్పెషాలిటీ, కేన్సర్ కేర్, సైక్రియాటిక్ బ్లాక్ పనులు చేపట్టింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిపిఆర్ కన్‌స్ట్రక్షన్ చేపట్టిన సూపర్ స్పెషాలిటీ బ్లాక్ పనుల్లో పాత రిమ్స్ పనుల తరహాలో అంతులేని నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. రూ.272 కోట్ల విలువైన పనుల పర్యవేక్షణను ఎపిఎంఎస్ఐడిసి ఇంజినీరింగ్ యంత్రాంగం గాలికి వదిలేసింది. ఫలితంగా బ్లాక్ ముగింపు దశ పనుల్లో భాగమైన ప్లాస్టింగ్ పనుల్ని అంత్యంత నాసి రకంగా చేపట్టడం విస్మయాన్ని కలిగిస్తోంది. బయటికి కనిపించే పనుల్నే ఇంతటి అధ్వానంగా చేపడితే అంతర్గత నిర్మాణ పనుల్ని ఎలా చేపట్టిందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపర్ స్పెషాలిటీ బ్లాక్ పనుల్లో నాసిరకం రాజ్యమేలుతోంది. 2019 డిసెంబర్ 23, 24, 25వ తేదీల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజీవ్‌గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెన్ కళాశాల ఆవరణంలో రూ.272 కోట్లతో సూపర్ స్పెషాలిటీ, రూ.40.81 కోట్లతో సైక్రియాటిక్, రూ.107 కోట్లతో కేన్సర్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వీటికి అదనంగా ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ హెల్త్ కేర్ హాస్పిటల్ బ్లాక్, గైనిక్ బ్లాక్ నిర్మాణ పను లకు గ్రీన్‌సిగ్నల్ లభించిన సంగతి తెలిసిందే. 2019, 2020, 2021 కరోనా వైరస్ విజృంభించడంతో సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్‌కేర్, సైక్రియాటిక్ సహా మిగిలిన నిర్మాణాల పనులు నిలిచిపోవడం అందరికీ తెలిసిందే. 2021 అనంతరం కరోనా మందగించడంతో సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి ముగింపు దశకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిపిఆర్ కన్‌స్ట్రక్షన్స్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణ పనులు చేపట్టింది. సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణ పనుల్లో అంతర్గత పనుల నాణ్యత ఎలా ఉన్నా బయటి ప్రపంచానికి కనిపించే ప్లాస్టింగ్ వంటి పనుల్లోనైనా నాణ్యతా ప్రమాణాలకు పాటించాలి. కానీ బిపిఆర్ కన్‌స్ట్రక్టన్స్ ఇష్టా రాజ్య ంగా నాణ్యతా ప్రమా ణాలను పాత రేసింది. ఫలితంగా సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ ప్లాస్టింగ్ పనుల్ని చూ స్తుంటే విస్మయం, ఆవేదన కలిసిన అనుభవం కలుగు తోంది. ఎపిఎం ఎస్ఐడిసి ఇంజి నీరింగ్ నిర్మాణాల పనుల గైడ్‌లెన్స్ ఎలా ఉన్నాయో తెలియదు, కానీ ప్లాస్టింగ్ పనుల్ని చూస్తుంటే నిబంధనలే సిగ్గుతో తలవంచుకునేలా పనుల తీరు కనిపిస్తోంది. ఇసుక, సిమెంట్ మిశ్రమంలో నాణ్యతను గాలికి వది లేసింది. ప్లాస్టింగ్ పనుల్లో ఇసుక డామినేట్ చేస్తున్న దృశ్యం నివ్వెర పరుస్తోంది. ఎపిఎంఎస్ఐడిసి ఇంజి నీరింగ్ యంత్రాంగానికి కనిపిం చకపోవడం విశేషం. దీనిపై ఓరిమ్స్ కాంట్రాక్టర్ స్పందిస్తూ బిపిఆర్ కన్‌స్ట్రక్షన్స్ నాణ్యతకు నిదర్శనమని చెబుతూనే కాంట్రాక్టర్ ప్రభుత్వాధినేతలతో సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఎటువంటి స్పందన ఉండే అవకాశం లేదని పేర్కొనడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి ముఖ్యమంత్రి జిల్లాలోని ఇటువంటి నాసిరకం పనులపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. రాయలసీమ ఆరోగ్య సంరక్షణలో కీలక భూమిక పోషించే రిమ్స్ అప్‌గ్రేడేషన్ పనుల్లో రాబోయే తరాలకు సరిపడా జరుగుతున్న అన్యాయానికి నిదర్శనంగా నాసిరకం మారనుందని చెప్పవచ్చు. దీనిపై ఎపిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను ఫోన్‌లో సంప్రదిచే ప్రయత్న చేయగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. నెల రోజుల కిందట సూపర్ స్పెషాలిటీ పనుల్లో నాసిరకం పనులను గమనించాం. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి నాసిరకం పనుల సమస్యను తీసుకెళ్లినప్పటికీ స్పందన లేదు. దీనిపై పోరాటానికి కసరత్తు చేస్తున్నాం.

- సుబ్బయ్య, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్.

విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విద్యుత్ ఛార్జీలను పెంచలేదని ఒకవైపున నోటిఫికేషన్ జారీ చేస్తూ, మరోవైపు సర్దుబాటు ఛార్జీల పేరుతో దొడ్డిదారిన భారాలు వేయడం మోసపూరితమని, వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతినెలా విద్యుత్ యూనిట్‌కు రూ.40 పైసల చొప్పున అదనంగా సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయటాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు ప్రతి నెలా వసూలు చేయడమే కాకుండా మళ్లీ సంవత్సరాంతంలో అవసరమైతే అదనంగా సర్దుబాటు భారం మోపే ప్రమాదం కూడా ఉందని పేర్కొన్నారు. గత సంవత్సరం ప్రభుత్వం రూ.1400 కోట్ల విద్యుత్ ఛార్జీలు పెంచి భారం మోపిందని ఆవేదన వ్యక్తంచేశారు. 2014-19 మధ్య వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు 36 నెలల పాటు యూనిట్‌కు రూ.25 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారని, దీని వలన రూ.2900 కోట్ల భారం పడిందన్నారు. 2020-21లో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు రూ.65 పైసలు వరకు 2023 ఏప్రిల్ నుంచి అదనంగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ పేరుతో రూ.3083 కోట్లభారం వినియోగదారులపై పడనున్నదని, స్మార్ట్ మీటర్లు పెట్టి వ్యయాన్ని నెలవారీగా ప్రజలపై వేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. పలు రూపాల్లో ప్రభుత్వం విద్యుత్ భారాలు ప్రజలపై మోపుతున్నదని, బడా కార్పొరేట్ కంపెనీల నుంచి విద్యుత్‌ను అధిక రేట్లకు కొనుగోలు చేస్తూ ఆ భారాన్ని కూడా ప్రజలపై మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదాని, తదితర కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే రీతిలో బొగ్గు అధిక రేట్లకు కొనుగోలు చేసి సర్దుబాటు చార్జీల పేరుతో దండుకుంటున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, తగ్గిస్తామని మాట చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మాట తప్పి ఈ రీతిలో భారాలు మోపటం అన్యాయమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతినెలా విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు విధించి భారాలు వేసే ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యుత్ భారాలను ప్రతిఘటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - రాయచోటి

దివ్య ఖురాన్ అవతరించిన మాసం రంజాన్ మాసంలో స్థానిక వీరభద్ర స్వామి ఆలయ మాజీ చైర్మన్ ఎద్దుల లక్ష్మప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని సంజీవ్‌నగర్ కాలనీలోని స్వగృహంలో ఇచ్చిన ఇఫ్తార్ విందులో రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి వతన్ నిసార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెంపుల్ మాజీ చైర్మన్ ఇచ్చిన విందు మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు. అత్యధిక ముస్లిం మైనార్టీలున్న రాయచోటి పట్టణంలో రాత్రి ముస్లిములకు స్వయంగా వడ్డించి ఇఫ్తార్ విందును ఇచ్చి ముస్లిం మైనార్టీలపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గం టిడిపి మైనార్టీ అధ్యక్షులు వతన్ సలీం, బి ఎం కె అమీర్, ఫారుక్, షబ్బీర్ హజరత్, న్యూ ఆంధ్ర, ముబారక్, ఫైరోజ్, షాజహాన్, కలీం,ఏక్బాల్ హుసేన్, అబ్బవరం మాజీ సర్పంచ్ రవీంద్ర నాయుడు, చంద్ర పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ గిరీష

శారీరక దృఢత్వానికి క్రీడలు అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక దృఢత్వం పెరుగుతుందని కలెక్టర్ గిరీషా పిఎస్ తెలిపారు. కలెక్టర్ వర్సెస్ ఎస్పీ జట్ల మధ్య గురువారం జిల్లా కేంద్రం రాయచోటి పోలీస్ పెరేడ్ మైదానంలో క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీంకు కలెక్టర్ కెప్టెన్‌గా వ్యవహరించగా ఎస్పీ టీమ్‌కు సంబంధించి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కెప్టెన్‌గా వ్యవహరించారు. టాస్ గెలిచిన ఎస్పీ బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఈ క్రికెట్ మ్యాచ్ ఆసక్తికరంగా కొనసాగింది. మొదటగా ఎస్పీ టీం బ్యాటింగ్ చేసింది. ఎస్పీ టీం 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 222 రన్‌లను సాధించింది. కలెక్టర్ బ్యాటింగ్ చేసి 11 రన్‌లు కొట్టి క్రీడాకారులను ఆకట్టుకున్నారు. ఆ తర్వాత 223 పరుగుల చేసింగ్ స్కోరుతో ఆటను ప్రారంభించిన కలెక్టర్ టీమ్ అన్ని వికెట్లు కోల్పోయి 112 పరుగులు సాధించి 111 రన్‌ల తేడాతో ఓటమిని చవిచూసింది. ఆట సమయంలో బౌలింగ్ ప్రక్రియను కలెక్టర్ ఆధ్వర్యంలో అత్యంత రసవత్తరంగా మారింది. 111 రన్నుల తేడాతో ఎస్పీ టీం గెలుపొందింది. కలెక్టర్ టీమ్ పై గెలుపొందిన ఎస్పీ టీంను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, కలెక్టరేట్, రెవెన్యూ, పోలీస్, అధికారులు పాల్గొన్నారు.

పెద్దశేష వాహనంపై రఘురాముడు

వాల్మీకిపురం: వాల్మీకిక్షేత్రంలోని శ్రీపట్టాభిరాముడి ఆలయంలో శ్రీరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు గురువారం రాత్రి 8గంటలకు స్వామివారు పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారికి మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8 గంటలకు సర్వభూపాల వాహనం తిరుమాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవ అనంతరం స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు పెద్దశేష వాహనసేవ కోలాహలంగా సాగింది. స్వామివారు పెద్దశేష వాహనాన్ని అధిరోహించి ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. మహిళలు పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారికి నేతి దీపాలతో తిరుమాడ వీధుల్లో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్‌రాయులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది దుశంత్, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనసేవ, రాత్రి 8గంటలకు పల్లకీలో మోహినీ అవతారోత్సవం.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ పుల్లయ్య

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు పోలీస్ స్టేషన్ వద్ద మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంచినీటి చలివేంద్రాన్ని గురువారం మన్నూరు సిఐ పుల్లయ్య, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణలు ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా తొలిరోజు ప్రజలకు బెల్లం పానకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వేసవికాలం కావడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ సమీపంలో మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు మంచినీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎఎస్ఐ శంకర్ నాయక్, హెడ్‌కానిస్టేబుల్ రహీంబాబు, పోలీసులు దర్బార్ భాష పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** డివిజనల్ అటవీ శాఖ కార్యాలయం వద్ద హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. మంచినీటితో పాటు పానకం కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు తాము ప్రతి ఏటా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, డిసిసి బ్యాంక్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూక్ష్మ నీటిపారుదల పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

సూక్ష్మ నీటిపారుదల పద్ధతులపై శిక్షణా కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జిఎస్.పాండురంగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం కలికిరిలో ఉదయం 10 గంటలకు ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు సూక్ష్మ నీటిపారుదల పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తునామని, జిల్లాకు అనువైన సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు, పథకాల గురించి శాస్త్రవేత్తలు అధికారులు విపులంగా వివరిస్తారని చెప్పారు. శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందిస్తారని అని తెలిపారు. కాబట్టి రైతులు శిక్షణ కార్యక్రమానికి హాజరై సద్వినియోగ పరచుకోగలరని తెలిపారు.

రేపు కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పార్లమెంటు ఎస్సి వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుమ్ము చిన్న మాదిగ పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సి వర్గీకరణ చేస్తామని మాదిగలకు హామీనిచ్చిన బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తికావస్తున్నా వర్గీకరణ చేయకుండా మోసం చేసిందని మాదిగ ప్రజల్ని 28 ఏళ్లుగా నమ్మించి దారుణంగా మోసం చేసిందన్నారు. ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు ఎస్సి వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడి, అధికారంలోకి రాగానే మాట మార్చి తన మోసపూరిత వైఖరిని చాటుకుందన్నారు. బిజెపి నమ్మక ద్రోహానికి, నయవంచనకు మారుపేరుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో బిల్లు పెట్టి ఎస్సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడికి మాదిగ ప్రజలంతా పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

నేడు బాటవారిపల్లిలో గడప గడపకూ..

ప్రజాశక్తి-కలకడ

మండల పరిధిలోని బాటవారిపల్లి పంచాయతీలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి శ్రీదేవి రవికుమార్, ఎంపిడిఒ సిహెచ్.నారాయణ, మండల పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని బాటవారి పల్లి పంచాయతీ ఆంజనేయవడ్డిపల్లి, కొత్త గాండ్ల పల్లి, గరుడప్పగారిపల్లి, అక్కన్నగారికోట, అక్కన్నగారికోట, హరిజన వాడ కె. మాదిగపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కలకడ

రాజ్యాంగ రక్షణ రణభేరి మహాసభను జయప్రదం చేయాలని విసికె పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు కోరారు. ఈ సందర్భంగా ఆయన బాస్ నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం విలేకరుతో మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు నుంచి లక్షల కోట్ల పెట్టుబడితో నిర్మించుకుంటూ వచ్చిన 339 ప్రభుత్వారంగా సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం జరిగిందన్నారు. బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్పు చేసి మనుస్మృతిని రాజ్యాంగంగా తీసుకొచ్చేదానికి ప్రయత్నిస్తున్న కుట్రలను భగ్నం చేయడానికే రాజ్యాంగ రక్షణ రణ భేరి మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షులు, చిదంబరం ఎంపీ తోల్ తిరుమావళవన్, ప్రజా యుద్ధ నౌకర్ గద్దర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, తోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి బహుజన మేధావులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పాల కుంట చౌడప్ప, సాదు రామాంజలు, గడియారపు గణేష్, రాజేష్, వేణుగోపాల్, సాయికుమార్, కిషోర్, నాగరాజు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిట్వేలు



విశ్రాంత ఉపాధ్యాయుని సన్మానిస్తున్న మానవత సభ్యులు

మండల పరిధిలోని మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ వారు చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు గంగరాజు లక్ష్మి మోహన్ ను మానవత సభ్యులు గురువారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మోహన్ పదవ తరగతి చదువు పేద పిల్లలకు తన వంతుగా రూ.5వేలు నగదును అందజేయడమే కాకుండా ప్రతి సంవత్సరం ఆర్థిక సాయం అందజేస్తున్నారని అన్నారు. ఎంతోకాలం విద్యా బోధన చేసిన పేద పిల్లలకు ఆర్థిక సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మానవతా సభ్యులు విశ్రాంత ఉపాధ్యాయుడు రంగారెడ్డి, జానీ, నూక శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆసక్తికరంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం దేశపు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాలు గంగాధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప పాల్గొన్నారు. పది జతల ఎద్దు పందెంలో పాల్గొన్నాయి. వేంపల్లెకు చెందిన పసుపులేటి రమణ ఎద్దు మొదటి స్థానంలో నిలిచి రూ.30 వేలు నగదు బహుమతిని గెలుచుకున్నాయి. అనంతపురం జిల్లా ఆత్మకూరు రవిచంద్ర, పులివెందుల బ్రాహ్మణ పల్లె చిన్నపుల్లారెడ్డి ఎద్దు రెండవ, మూడవ బహుమతులను గెలుచుకున్నాయి. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు, సంఘ అధ్యక్షుడు గూడూరు గురు ప్రసాద్, యార్వ వెంకటసుబ్బయ్య, అంకాలమ్మ గుడి చైర్మన్ ప్రసాద్, కడియాల లక్ష్మీనారాయణ, కొంగనపల్లె మురళి, కౌన్సిలర్ కొండలరావు, సోఫాల వీరా, ఆంజనేయులు, తోటంశెట్టి హరి, వీరశైవ గురు జంగమ లింగాయత్ సంఘం నాయకులు వీరభద్రయ్య, నాగభూషణం, అంగడి నాగేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



రాయచోటి :శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

కష్టాలెన్ని ఎదురైనా ధర్మాన్ని విడిచిపెట్టని శ్రీరామచంద్రుడిని ప్రజలందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఎన్‌జిఒ కాలనీలోని రామాలయంలో శ్రీరామనవమి సంధర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలు, సంక్షోభాలు ఎదురయినప్పుడు వాటికి భయపడి పారిపోకుండా ఎలా విజయాలు సాధించాలో శ్రీరాముడు లోకానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన మోహన్ రెడ్డి, మహేష్ రెడ్డి, లయన్ యర్రపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామచంద్రయ్య,కార్యదర్శి జయచంద్రా రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు నరేంద్ర రెడ్డి, నూకల నరసరాజు, శ్రీనివాసులు, చక్రపాణి పాల్గొన్నారు. **రామాపురంలో..** ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సొంతగ్రామం ఎర్రంరెడ్డిగారిపల్లెలోని రామాలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో తన తండ్రి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో , వైభవోపేతంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. మండలంలోని బండపల్లి, హసనాపురం, చిట్లూరు, కుమార్‌పల్లి గ్రామాల సరిహద్దుల్లో వెలసిన అభయాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామ కళ్యాణ వేడుకల్లో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ రెడ్డి, వైస్ ఎంపిపి బాబు, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి, వెంకటప్ప పాల్గొన్నారు.
బి.కొత్తకోట: మండల పరిధిలో శ్రీ రామనవమి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని రామాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రమైన బి.కొత్తకోట పోకనాటి వీధిలోని శ్రీరాముని ఆలయంలో సీతారామాంజనేయ ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు చేశారు. అర్చకులు వేద మంత్రాలు, శ్రీ రామ గోవింద నామస్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో కల్యాణ క్రతువును నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి వచ్చిన వారికి.వివి రెడ్డి, వంక నారాయణరెడ్డి, వంక వెంకట్‌రెడ్డి, కంచి కోదండ, ఎర్రగుంట్ల మోహనరెడ్డి ,ఎర్రగుంట్ల వెంకటరమణ రెడ్డి, కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి, కంచి బలరాంరెడ్డి, కంచి లోకేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తేజరెడ్డి, వంక వెంకట్ రమణరెడ్డి, కుట్టి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.
రాజంపేట అర్బన్ : మండల పరిధిలోని వైబియన్ పల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వినాయక అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేకపూజలు, అభిషేకాలు, ఆకుపూజ, వడమాల పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి అప్పలాచారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. **కలికిరి:** పట్టణంలోని రెడ్డివారిపల్లెలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. రెడ్డివారిపల్లెలో సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎల్లమ్మ దేవాలయ చైర్మన్ రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కన్నుల పండుగగా సీతారాముల కల్యాణోత్సవం హిందూ సంప్రదాయ పద్ధతిలో మంగళ వాయిద్యాలు నడుమ, పూలతోరణాలతో, శాస్త్రోతంగా నిర్వహించారు.
నందలూరు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని ఎగువకుమ్మరిపల్లెలో మాజీ జడ్‌పిటిసి ఎల్లటూరు శివరామరాజు, ఎల్లటూరు శ్రీనివాసరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు బండాత్మకూరు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణలు మధ్య కమనీయంగా రమణీయంగా నిర్వహించారు. యాదగిరి రాజు, విజయలక్ష్మి, దంపతులు, సురేష్ రాజు, ఆశ దంపతులు ఉబయదారులుగా వ్యవహరించారు. కళ్యాణ వేదికను పూలతో సుందరంగా అలంకరించి సీతారామ, లక్ష్మణ, హనుమంతు ఉత్సవ విగ్రహాలను విగ్రహాలను కొలువు తీర్చి కళ్యాణ తంతును కమనీయంగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు జారవిడిచారు. కళ్యాణ అనంతరం విందును భారీ ఎత్తున ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో మాజీ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, టిడిపి నాయకులు సోముల రాజు చంద్రశేఖర్ రాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, రాష్ట్ర బిసి నాయకులు శ్రీధర్ బాబు యాదవ్, తాటి సుబ్బరాయుడు, చామంచి పెంచలయ్య, కానకుర్తి వెంకటయ్య, సర్పంచ్ అక్కిరెడ్డి మోహన్ రెడ్డి పాల్గొన్నారు. **నందలూరు :** శ్రీరాముని రాజ్యం నారా చంద్రబాబునాయుడుతో సాధ్యమవుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్‌రాయుడు అన్నారు. శ్రీరామనవమి పునస్కరించుకొని ఇసుకపల్లిలో శ్రీరాముని కల్యాణం వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, గొల్లపల్లి సుబ్బరాయుడు, ఎస్సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జ్యోతి శివ, గుండు సురేష్, గంధం గంగాధర్, ముమ్మడిశెట్టి రమేష్, నాయకులు బుర్ర సుబ్బరాయుడు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** మండలంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రామాలయంలో శ్రీనివాసశర్మ స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. శేష సాయి ఆలయంలో వేద పండితులు స్కంద మూర్తి శర్మ, రాఘవేంద్ర స్వాములు సీతారాముల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మల్లయ్య కొండపై గౌరమ్మ తల్లి ఆలయంలో గౌరీ దేవి శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని అమ్మినేనివీధిలో వెలసిన శ్రీకోదండ రామాలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డితో పాటు 23వ వార్డు కౌన్సిలర్ గిరిజా సాయిశేఖర్ రెడ్డి, జోళపాలెం భవానీ ప్రసాద్ హాజరై స్వామివారిని దర్శించుకుని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు దుగ్గిరెడ్డి, రఘునాథ్ రెడ్డి, మోహన్ పాల్గొన్నారు. **గాలివీడు :** ఆలయాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గాలివీడు బస్ స్టాండ్ ఆవరణంలో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని వడపప్పు, పానకం పంపిణీ చేశారు. భక్తులు , ప్రజలు కులమతాలకు అతీతంగా పెద్ద ఎత్తున హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. **పెద్దమండ్యం:** మండల కేంద్రంలో కోదండరాముని కోవిలల్లో సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వాములను పట్టు వస్త్రాలుతో, వివిధ పుష్పలతో అలంకరించి వేదమంత్రాలతో పూజలు, అభిషేకం నిర్వహించారు. మండలంలోని బిక్కవాండ్లపల్లి, రెడ్డివారిపల్లి, ఎర్రసానిపల్లి, బంద్రేవు, కలిచెర్ల, సిద్దవరం, వెళిగల్లు తదితరులు పంచాయతీలలో సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వాములవారిని మంగళ వాయిద్యాలతో, బాణసంచ వేడుకలతో, భజన భక్తులతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు మణికంఠస్వామి, ప్రసాద్ స్వామి అచ్చుతా స్వామి విజయస్వామి, పవన్ స్వామి, జ్యోతి నరసింహ శంకర్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా హార్సిలీహిల్స్

ఎటుచూసినా మద్యం బాటిళ్ల దర్శనం

ప్రజాశక్తి-బి.కొత్తకోట



గాలిబండ పరిసర ప్రాంతాల్లో ఉన్న మద్యం బాటిళ్లు

ఆంధ్ర ఊటీగా ప్రసిద్ధిగాంచిన జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు ఒకప్పుడు సామాన్యుల సైతం ఆహ్లాదం కొరకు వెళ్లి వచ్చేవారు. ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా కేవలం ధనవంతులు మాత్రమే ప్రస్తుతం హార్సిలీ హిల్స్ అందాలని ఆస్వాదిస్తున్నారనడం అతిశయోక్తి లేదు. ఇందుకు కారణాలు అనేకం ముఖ్యంగా కొండపై వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.దీనికి తోడు టోల్ చార్జెస్, పార్కింగ్ చార్జెస్ పేరుతో పర్యాటకులపై ఆర్థిక భారం మోపుతున్నారు. కొండపై పారిశుధ్యం సైతం పూర్తిగా లోపించింది. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండిపోయింది. గురువారం గాలిబండ పరిసర ప్రాంతాల్లో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవించి, బాటిళ్లను పగలగొట్టిన గాజు సిసాలను అక్కడే వదిలి వెళ్ళిపోతుండడంతో ఆ ప్రాంతమంతా గాజు పెంకులతో నిండిపోయింది. పరిశుభ్రతపై ఏ అధికారి వచ్చిన మాటల్లోనే కానీ చేతల్లో చూపించడం లేదంటూ స్థానికులు, పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని మద్యం ప్రియుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి, పర్యాటక రంగంలో ఆదాయానికి వనరుగా ఉన్న హార్సిలీహిల్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎన్నికల హామీని నెరవేర్చాలని సీనియర్ ఆరోగ్య మిత్రల డిమాండ్

ప్రజాశక్తి - బి కోడూరు

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 2008వ సంవత్సరం నుండి సుమారు 3000 మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. తాము అధికారంలోకి రాగానే వీరిని పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2018లో జిల్లాలోని ఎర్రగుంట్లలో పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం రాగానే పాదయాత్రలో చెప్పిన మాటని విస్మరించి సచివాలయంలో కొత్తగా గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీ ఏర్పాటు చేసి వారికి ఆరోగ్యమిత్ర అని పేరు పెట్టి పర్మిట్ చేశారు. 15ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ ఆరోగ్య మిత్రలకు ఎలాంటి జీతం పెంపుదల, వారికి సరైన ఉద్యోగ భద్రతగానీ కల్పించలేదు. కేవలం ఆప్కాస్‌లో చేర్చామనే మాట తప్ప వారికి ఎలాంటి సహాయం చేయలేదు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన మోహన్‌రెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితంలేదని వారు వాపోతున్నారు. ఈ విషయాన్ని సిఎం పర్యటనలో సీనియర్ ఆరోగ్య మిత్రలు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. మీకు త్వరలోనే న్యాయం చేస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఇప్పటికైనా సిఎం హామీ మేరకు అధికారులు సీనియర్ ఆరోగ్యమిత్రులకు కనీస వేతనం రూ.28వేలు మంజూరు చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి రాష్ట్ర ఆరోగ్యమిత్రల సంఘం కోరుతోంది.

సేవలోనే ఆత్మ సంతృప్తి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సమాజానికి సేవలందించడంలోనే ఆత్మ సంతృప్తి ఉందని పసుపుల వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ పసుపుల సుబ్బరాయుడు తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా గురువారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆటో ద్వారా మొబైల్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ తన తల్లి వెంకటమ్మ చేతుల మీదుగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. సిబిఐ మాజీ జెడి లక్ష్మీ నారాయణ స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. మండుతున్న వేసవిలో రోడ్డు మీద నడిచే ప్రజల దాహం తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రతిరోజు స్థానికంగా కొత్త మార్కెట్, పాత బస్టాండు, శివాలయం సర్కిల్, మైదుకూరు రోడ్డు, గాంధీరోడ్డు మీదుగా ఈ చలివేంద్రం ద్వారా తాగునీటిని అంది స్తామన్నారు.

ప్రతి ఒక్కరికీ విద్య ఎంతో అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్య ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌లో భాగంగా గురువారం మీనాపురం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగం కోసమే కాకుండా జ్ఞాన సముపార్జన చేస్తే స్వయం ఉపాధి అవకాశాలైనా పొందవచ్చని వివరించారు.

శైలజానాథ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

పిసిసి మాజీ అధ్యక్షులు సాకె శైలజానాథ్‌ను కాంగ్రెస్ నాయకులు కలిశారు. గురువారం నెల్లూరు నుంచి అనంతపురం వెళుతుండగా, కడప నగర శివారులోని అలంఖాన్‌పల్లె వద్ద ఎన్ఎస్ యుఐ ఉరాష్ట్ర ఉపాధ్యక్షులు ధృవకుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, అనిల్, వేమయ్య, వెంకటేష్, బాబు కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులపై చర్చించారు.

సాహితీకారుల చిత్రపటాలు బహూకరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

న్యాయవాది, సాహిత్యాభిమాని, సామాజిక సేవాతత్పరులు, విద్యాధిపతి ఎం.ఎ.బాషా పట్టణంలోని గ్రంథాలయం, అనేక పాఠశాలలకు వందలాది సాహితీకారుల తైలవర్ణ చిత్రపటాలను బహుమతిగా అందజేశారు. గురువారం విద్యోదయ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలకు కొన్ని వర్ణచిత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సాహిత్యంపై మంచి పట్టు సాధించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాసులు నాయుడు, అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రజా చైతన్య స్రవంతి ప్రెసిడెంట్ డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, కథ నవలా రచయిత, విమర్శకులు టిఎస్ఎ కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాలు బహూకరిస్తున్న బాషా



లోకేష్ పాదయాత్రలో పర్వీన్‌తాజ్

యువగళం పాదయాత్రలో పాల్గొన్న పర్వీన్‌తాజ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర ప్రస్తుతం పెనుగొండ నియోజకవర్గంలో సాగుతోంది. గురువారం ఈ పాదయాత్రకు పట్టణానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్‌తాజ్ పాల్గొని లోకేష్ వెంట నడిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువగళం పాదయాత్రకు రోజురోజుకు ప్రజా మద్దతు పెరుగుతోందన్నారు. అన్నివర్గాల ప్రజల నుంచి పాదయాత్రకు సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. పాదయాత్రలో పరిటాలశ్రీరామ్, మండలానికి చెందిన టిడిపి నాయకులు చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్ వన్ అధికారి డాక్టర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి సూచించారు. వారం రోజులపాటు జరిగే ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఎన్‌టిఆర్ కాలనీలోని పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రెండవ యూనిట్ అధికారి వెంకట నరసయ్య మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థలో సమతుల్యాన్ని పాటించాలంటే మొక్కలు నాటాలని సూచించారు. ప్రజలకు మొక్కల సంరక్షణ మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండి సత్యనారాయణ

జీవనోపాధి కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-వీరబల్లి

జీవనోపాదుల కల్పనే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బండి సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సిబ్బంది సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సభ్యులు తీసుకొన్న రుణాలను కచ్చితంగా జీవనోపాధి ఏర్పాటు చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలైన వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, జగనన్నతోడు, వివిధ సంస్థల నుంచి ఇప్పించే రుణాలు సద్వినియోగం చేసుకోనెలా చూడాలన్నారు. రుణాలు 100 శాతం చెల్లించేలా దృష్టి పెట్టాలని కోరారు. ఆదివారం స్థానిక జిల్లా పారిషత్ హైస్కూల్‌లో జరిగే వైఎస్ఆర్ ఆసరా కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపియం ఖాదర్ వలి, మండల సమాఖ్య సిబ్బంది, గ్రామ సమాఖ్యల సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నాయకులపై విమర్శలు తగవు

-ఎమ్మెల్యే నవాజ్ బాషా

మదనపల్లె అర్బన్ : ఆధారాలు లేకున్నా వైసిపి నాయకులపై టిడిపి నాయకులు విమర్శలు చేయడం తగదని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే నెపంతో స్కిల్ డెవలప్మెంట్ పేరుతో రూ.371 కోట్ల కుంభకోణం జరిగిందని తెలిపారు. ఈ కుంభకోణం వెనక మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హస్తం ఉందని, త్వరలోనే శిక్ష పడే అవకాశం ఉందని, జైలుకి వెళ్లడం ఖాయమని అన్నారు. ఈ అంశంపై ఇప్పటికే ఐటీ శాఖ విచారణ వేగవంతం చేసిందని అన్నారు. ఎపిఎండిసి చైర్‌పర్సన్ షమీమ్ అస్లాం, మున్సిపల్ పర్సన్ మనుజ, వెంకటాచలపతి, వెలుగు చంద్ర, సిటియం సర్పంచ్ ఆనంద్ మాట్లాడుతూ టిడిపి హయాంలో జాబు కావాలంటే బాబు రావాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటి గోడకు రాసిన బాబు 2019 ఎన్నికలలో ఎందుకు ఇంటికి వెళ్లారో ప్రజలకు బాగా అర్థమైందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నూర్‌ఆజాం, కౌన్సిలర్లు శ్రీనివాసులు, రాజేష్, ఈశ్వర్‌నాయక్ కరీముల్లా, నాయకులు ఎల్ఐసి సుధాకర్, బాల గంగాధర్ రెడ్డి, సర్పంచ్ మధు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలోని మల్లూరువారిపల్లి సమీపంలో ఉన్న మదనపల్లి - కదిరి ఫ్లైఓవర్ కింద రైల్వేట్రాక్‌కి దగ్గరలోని కాలవ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తి నాలుగైదు రోజుల కిందట మృతి చెంది ఉంటాడని అన్నారు. బ్లూ, తెలుపు, ఆరెంజ్, నిలువు అడ్డము గిర్రలు కలిగిన హాఫ్‌షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. వంకాయ పువ్వు కలర్ కలిగిన ఫుల్ డ్రాయర్ కలిగి ఉంది, నలుపు, బ్లూ, తెలుపు నిలువు అడ్డము గీరలు కలిగిన లుంగీ ఉందన్నారు. మృతుడు 60 నుంచి 65 సంవత్సరాల వయసు వరకు కలిగి ఉంటాడని, గడ్డముపై తలపై వెంట్రుకలు తెలుపు రంగులో ఉన్నాయని, బట్టతలగా ఉందన్నారు. మృతదేహాన్ని సంబంధించిన ఎవరైనా గుర్తిస్తే మదనపల్లి డిఎస్‌పి 9440796738, రూరల్ సిఐ 9490617891, ఎస్ఐ 9440900707 మొబైల్ నంబర్లను సంప్రదించాలన్నారు.